



ఓ చెంచు కుటుంబం గుడిసె

పునరావాసానికే మొగ్గు

- అడవిని విడిచేందుకు ముందుకొస్తున్న చెంచులు
- అంతరిస్తున్న ఉత్పత్తులు, పులుల భయమే కారణం
- అక్కడే ఉంటే మెరుగైన విద్య, వైద్యం అందదనే భావన
- ఎన్‌టీసీఏ పథకంలో భాగంగా ప్యాకేజీలు అందిస్తున్న ప్రభుత్వం
- పలు చెంచుపెంటల నుంచి 90 శాతం మంది అంగీకారం



పునరావాసంలో భాగంగా తరలించనున్న సార్లపల్లి గ్రామం

దోమలపెంట, ఏప్రిల్ 16: నల్లమల అటవీ ప్రాంతంలో ఫలాలు, ఉత్పత్తులు రోజు రోజుకు తగ్గిపోతుండటంతో వాటిని సేకరించి, జీవనం సాగించే లోతట్టు ప్రాంత చెంచులు, చెంచేతరులకు పూట గడవటం ప్రశ్నార్థకంగా మారింది. దీనికితోడు వటువర్లపల్లి, సార్లపల్లి, కుడిచంతలబావి, తాటిగుండాల, కొల్లంపెంట, కొమ్మనపెంట చెంచుపెంటలు దట్టమైన అమ్రాబాద్ అభయారణ్యం ప్రాంతంలో ఉన్నాయి. ఈ ప్రాంతంలో గతంలో అటవీ జంతువులు తక్కువగా ఉండటంతో ఆరు దశాబ్దాల పాటు వ్యవసాయం చేసేందుకు కొంత అనుకూలంగా ఉండేది. రానురాను అడవుల అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించడంతో నల్లమలలో పులులు, చిరుత పులులు, ఎలుగుబంట్లు, దుప్పులు, జింకలు, అడవి పందులు, కోతులు గణనీయంగా పెరిగాయి. దాంతో అటవీ ప్రాంతంలో భూమిలో విత్తనం వేసిన నాటి నుంచి పంట ఇంటికి చేరే వరకు అటవీ జంతువుల నుంచి కాపాడుకునేందుకు రైతులకు కత్తిమీద సాములా మారింది. ఒక్క పూట కాపలా లేకపోతే కష్టం బూడిదలో పోసిన పన్నీరవుతుందన్న ఆందోళన నెలకొంది. మరోవైపు ఇక్కడ వర్షాధారంగానే వ్యవసాయం చేస్తుండటంతో నీరు, కరెంటు సౌకర్యం లేక సాగుకు మొగ్గు చూపడం లేదు. దాంతో అడవిని విడిచి అటవీ శాఖ ఎన్‌టీసీఏ పథకంలో భాగంగా కల్పిస్తున్న పునరావాసం పొందేందుకు ఆసక్తి చూపుతున్నారు. అయితే వటువర్లపల్లి, సార్లపల్లి గ్రామాల 20 శాతం మంది ప్రజలు మాత్రం.. తమ తాతముత్తాతల కాలం నుంచి ఇక్కడే బతుకుతున్నామని, ఉన్న ఊరును విడిచి వెళ్లాలంటే కన్న తల్లికి దూరయినట్లు బాధేస్తుందని అంటున్నారు. తమకు పునరావాసం వద్దని, చావయినా.. బతుకయినా ఇక్కడే ఉంటామని చెబుతున్నారు.





నల్లమల అభయారణ్యం

భయం గుప్పిట్లో..

వటువర్లపల్లి, సార్లపల్లి, కుడిచింతలబావి, తాటిగుండాల, కొల్లం, కొమ్మెనపెంట గ్రామాల్లోకి పెద్ద పులులు, చిరుత పులులు చొరబడి నిత్యం పశువులు, మేకలను చంపి తింటున్నాయి. మేత కోసం అడవికి వెళ్లిన పశువులు, జీవాలు ఇంటికి తిరిగి వస్తాయన్న నమ్మకం రోజు రోజు సన్నగిల్లుతోంది. పులుల వల్ల చనిపోతున్న పశువులకు అటవీశాఖ నామమాత్రంగా పరిహారం ఇస్తోంది. అటవీ జంతువుల వల్ల పంటలు దెబ్బతిన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మరోవైపు అటవీ శాఖ అధికారుల ఒత్తిళ్లు కూడా అధికమవడంతో ఇక్కడ జీవించాలంటే చెంచుల్లో అభద్రతా భావం ఏర్పడింది.

బయటి ప్రపంచంతో పోటీ పడలేమని..

డిగ్రీలు, పీజీలు, ఇంజనీరింగ్‌లు చదివినా.. ఉన్న ఊరిలో ఉపాధి అవకాశాలు లేక చాలా మంది యువకులు.. నిరుద్యోగులు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్తున్నారు. మారుమూల ప్రాంతంలో ఉంటే తమ పిల్లలకు మంచి విద్య, వైద్యం ఇవ్వలేమని, ఇక్కడే ఉంటే తమ పిల్లలూ కూలీలుగానే బతకాలని, బయటి ప్రపంచంతో పోటీ పడలేరని చెంచులు భావిస్తున్నారు. అందుకే అటవీ ప్రాంతం నుంచి బయటికి వచ్చేందుకు 90 శాతం మంది సిమయ్యారు.

పునరావాసం కోసం స్వచ్ఛందంగా ముందుకు..

అడవిలో జీవనం రోజు రోజుకు గగనంగా మారడంతో అటవీ శాఖ కల్పిస్తున్న పునరావాసం పొందేందుకు చెంచులు ముందుకొస్తున్నారు. అమ్రాబాద్ అభయారణ్యంలోని సార్లపల్లి చెంచులు స్వచ్ఛందంగా ముందుకు రావడంతో ఎన్‌టీసీఏ పథకం(నేషనల్ టైగర్ కన్జర్వేషన్ ఆఫ్ అథారిటీ)లో భాగంగా పెద్దకొత్తపల్లి మండలం బాచారంలో వీరికి పునరావాసం కల్పించేందుకు అటవీ శాఖ నిర్ణయించింది. సార్లపల్లిలో అన్ని కులాలు కలిపి 164 ఉమ్మడి కుటుంబాలు ఉన్నాయి. ఇందులో చెంచు కుటుంబాలు 70, చెంచేతర కుటుంబాలు 94 కుటుంబాలు ఉన్నాయి. ఎన్‌టీసీఏ పథకం నిబంధనల ప్రకారం 18 ఏళ్లు పైబడిన యువతీ యువకులను ఒక కుటుంబం కింద పరిగణిస్తారు. ఈ నేపథ్యంలో పథకంలో లబ్ధిపొందేందుకు సార్లపల్లి నుంచి దరఖాస్తు చేసుకున్న వారిలో 186 కుటుంబాలను అర్హులుగా గుర్తించారు. అందులో చెంచు కుటుంబాలు ఐదు, ఎస్సీ 29, బీసీ 142, ఓసీ కుటుంబాలు 10 ఉన్నాయి. వారిలో 85 మంది రూ.15 లక్షల నగదు ప్యాకేజీ, 101 మంది అన్ని మౌలిక వసతులతో తూడిన ఇంటి నిర్మాణం, ఐదు ఎకరాల వ్యవసాయ భూమి తీసుకునేందుకు సమ్మతించారు. సార్లపల్లికి చెందిన పలు చెంచు కుటుంబాలు అటవీశాఖ ఆధ్వర్యంలో ఇటీవల బాచారం గ్రామాన్ని సందర్శించాయి. అక్కడి భూములు, పరిస్థితులను పరిశీలించిన తరువాత మరో 15 చెంచు కుటుంబాలు పునరావాసం కోసం దరఖాస్తు చేసుకున్నాయి.

కుడిచంతలబావిలో..

కుడిచంతలబావిలో అన్ని వర్గాల వారివి 105 ఉమ్మడి కుటుంబాలు ఉన్నాయి. 166 మందిని పునరావాసం ప్యాకేజీలో అర్హులుగా గుర్తించారు. అందులో చెంచు కుటుంబాలు 28, లంబాడ గిరిజన తొమ్మిది, ఎస్సీ 3, బీసీ 97 కుటుంబాలు ఉన్నాయి. రూ.15 లక్షల నగదు ప్యాకేజీ తీసుకునేందకు 72 మంది, వ్యవసాయ భూమి, ఇండ్లు పొందేందుకు 94 మంది ముందుకు వచ్చారు. తాటిగుండాల చెంచు పెంటలో మొత్తం 24 చెంచు కుటుంబాలు ఉన్నాయి. వీరంతా పునరావాసంలో భాగంగా భూమి తీసుకునేందుకు ముందుకొచ్చారు. కుడిచింతలబావి, తాటిగుండాల గ్రామాల్లో 100 శాతం ఊరును ఖాళీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. దాంతో ఆ గ్రామాలకు పునరావాసం కల్పించే విషయమై కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ వేసేందుకు అటవీశాఖ కసరత్తు చేస్తోంది.

వటువర్లపల్లిలో..

వటువర్లపల్లిలో 600 మందికిపైగా పునరావాసం కోసం దరఖాస్తు చేసుకున్నారు. 515 కుంటుంబాలకు గత సవత్సరంలో సోషల్ ఎకనామికల్ సర్వే చేశారు. ఇక్కడ 90 శాతం మంది ఎన్‌టీసీఏ పథకంలో పునరావాసం పొందేందుకు అనుకూలంగా ఉన్నారు. ఆ కుటుంబాలకు సంబంధించి త్వరలోనే ఆర్అండ్‌టీ సర్వే చేపటేందుకు అటవీ శాఖ అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. వటువర్లపల్లి, సార్లపల్లిలో కొందరు గిజనులు, గిజనేతరులు పునరావాస ప్యాకేజీ అమలుపై అనుమాలు వ్యక్తం చేస్తున్నారు. ముందుగా పునరావాసం పొందేవారికి కల్పించే వసతులను గమనించి, ఆ తర్వాత మిగతా వారు అడుగు వేసే ఆలోచనలో ఉన్నారు.

ఎవరినీ బలవంతంగా తరలించడం లేదు



ఎన్‌టీసీఏ పథకంలో పునరావాసం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి అన్ని రకాల వసతులతో తిరుపతి-హైదరాబాద్ ప్రధాన రహదారి పక్కన పెద్దకొత్తపల్లి మండలం బాచారంలో కాలనీ నిర్మిస్తున్నాం. వారికి ఐదు ఎకరాల వ్యవసాయ భూమి రెవెన్యూ భూమిగా బదలాయించి ఇస్తాం. అందులో ఎటువంటి సందేహం లేదు. అటవీశాఖ తరఫున ఎవరినీ బలవంతంగా తరలించడం లేదు. ఇష్టపడి వచ్చే వారినే పంపిస్తాం. అటవీ జంతువులకు ఇబ్బంది కలిగించి, అడవులను ధ్వంసం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

- రోహిత్ గోపిడి, డీఎఫ్‌వో, అచ్చంపేట

పునరావాసం పొందేందుకు సిద్ధంగా ఉన్నాం



మా తాతలు, తండ్రులు, మేము అడవిలో ఉండటంతో మాకు సరైన చదువు లేదు. ఏదైన ఆపని వస్తే 50 కిలో మీటర్ల దూరంలో ఉన్న అచ్చంపేటకు పోవాలి. తాగేందుకు మంచి నీళ్లు కూడా లేవు. చిలుము నీళ్లు తాగడంతో చాలా మంది చెంచుల కడుపుల్లో గడ్డలు అయ్యి ఎందరో చనిపోయారు. చదువు లేక చిన్నతనంలో పెండ్లిల్లు, కాన్పులు కావడం, తాగుడుకు అలవాటు పడటంతో తమ జాతి అంతరించి పోతోంది. మేము పునరావాసం పొందేందుకు సిద్ధంగా ఉన్నాం. మా చెంచులు కొందరు పట్టణాల్లో ఉంటూ తప్పుడు మాటలు చెప్పి, నాలాంటి వారిని అడవుల నుంచి బయటకు రాకుండా చేస్తున్నరు.

- మండ్లి భౌరమ్మ, మాజీ సర్పంచ్, కుడిచింతలబావి

మైదాన ప్రాంతంలో మేం బతుకలేం



మా చెంచు గిరిజనులు అడవులను వదిలి మైదాన ప్రాంతంలో బతుకలేరు. మా జాతి వారికి వ్యవసాయం చేయడం రాదు. పునరావాస ప్యాకేజీలో బాచారం తీసుకపోతే అక్కడ ఎటువంటి అటవీ ఉత్పత్తులు దొరుకవు. జీవనోపాధి కష్టంగా ఉంటుంది. ఇష్టపడి పోయేవారికి మేము వ్యతిరేకం కాము. కానీ బలవంతంగా తరలించాలని ఒత్తిడి చేస్తున్నట్లు మా సంఘానికి ఫిర్యాదు చేస్తే.. కలెక్టర్, డీఎఫ్‌వోలపైనా కేసులు పెట్టేందుకు కూడా వెనుకాడం.

- చిగుర్ల మల్లికార్జున్, తెలంగాణ ఆదివాసి ఐక్య వేదిక కన్వీనర్(సార్లపల్లి)

శ్రీరాముడు సేద తీరిన రామకొండ

- కొండపై స్వయంభువుగా రామపాదం
- ఆదివారం అమావాస్య రోజు స్వామికి ప్రత్యేక పూజలు
- నేడు సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు


కోయిలకొండ, ఏప్రిల్ 16: త్రేతాయుగంలో శ్రీరాముడకి సేద నిచ్చిన స్థలంగా మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండలోని శ్రీరామకొండ ప్రసిద్ధి గాంచింది. శ్రీరాముడ లక్ష్మణుడితో కలిసి రామకొండలోని ప్రస్తుతం ఉన్న గర్భాలయం బండపై కొంత సేపు సేద తీరారని, దీంతో అక్కడ శ్రీరాముని కుడి పాదం స్వయం భువుగా వెలిసిందని ప్రచారంలో ఉంది. కొండపై ఉన్న కోనేర్లు, ప్రకృతి అందాలను చూసి రాములవారు తన్మయం చెందారని పూర్వీకులు చెబుతున్నారు. శ్రీరాముడు వచ్చిన విషయాన్ని రుషులు తెలుసుకుని, ఈ కొండపై స్థావరాలు ఏర్పాటు చేసుకొని పూజలు చేశారని తెలుస్తోంది. నేటికి ఇక్కడ మునుల స్థావరాలు కనిపిస్తాయి. ఈ కొండపై సంజీవని చెట్టుతో పాటు పలు ఆయుర్వేద మూళికలు ఉన్నాయని గ్రామ పెద్దలు చెబుతున్నారు. ఆదివారం అమావాస్య రోజు ఇక్కడికి భక్తులు వేలాదిగా తరలొచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఇక్కడి కోనేటి నీటిని, కొండపై ఉండే చెట్ల కొమ్మలను ఇళ్లను తీసుకెళ్తారు.



కొండపై సీతారాముల విగ్రహాలు



కొండపై వెలిసిన రామపాదం



రామకొండపై వెలిసిన ఆలయం

ఏర్పాట్లు పూర్తి

శ్రీరామనవమి సందర్భంగా బుధవారం రామకొండపై సీతారాముల కల్యాణాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. నవమికి ముందు రోజు సీతారాముల ఉత్సవ విగ్రహాలకు కోయిలకొండలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం పల్లకీలో స్వామి, అమ్మవార్లను కొండపైకి ఊరేగింపుగా తెస్తారు. ఈ సందర్భంగా వర పూజ, ఎదురుకోళ్ల నిర్వహిస్తారు. నవమి రోజు భద్రాచలంలో మాదిరిగా అభిజిత్ లగ్నంలో స్వామి, అమ్మవారికి కల్యాణం చేస్తారు.

రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ

- జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్



అధికారులతో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఏప్రిల్ 16: పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను ఏప్రిల్ 18వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవచ్చునని జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో అభ్యర్థుల నోటిఫికేషన్ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఏప్రిల్ 18న నాగర్‌కర్నూల్ రిటర్నింగ్ అధికారి ద్వారా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. వనపర్తి జిల్లా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఉన్నందున నామినేషన్‌లు నాగర్‌కర్నూల్ జిల్లాలో రిటర్నింగ్ అధికారికి సమర్పించాలని సూచించారు. ఏప్రిల్ 25 వరకు నామినేషన్ గడువు ఉంటుందన్నారు. అభ్యర్థులు నేరుగా రిటర్నింగ్ అధికారికిగాని, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరకాస్తు చేసుకునే వారు హార్డ్ కాపీలను రిటర్నింగ్ అధికారికి సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లాలో ఎన్నికలు పారదర్శకంగా.. ప్రశాంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు తమ వంతు సహకారం అందించాలని ప్రజాప్రతినిధులను కోరారు. అదేవిధంగా పార్లమెంట్ ఎన్నికల సన్నదతపై అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, నగేష్‌లతో కలిసి నోడల్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. నోడల్ అధికారులకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మే 3 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించే పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్లు, హోమ్ ఓటింగ్‌కు సంబంధించి ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని సూచించారు. హోమ్ ఓటింగ్‌కు సంబంధించి రూట్ మ్యాప్, భద్రత, రవాణా, పోలింగ్ సిబ్బంది వంటి ఏర్పాట్లకు పకడ్బందీగా ప్రణాళికలు చేసుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, వీల్‌చైర్, వలంటీర్‌ల ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలని పోలీస్ శాఖ అధికారులకు సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, సీవిజిల్, ఫిర్యాదుల స్వీకరణ తదితర అంశాలపై నియమించబడిన నోడల్ అధికారులు విధులు జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఆర్డీవో పద్మావతి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, నోడల్ అధికారులు, సీ సెక్షన్ ఎలక్షన్ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నుంచి వేణాచారి, త్రినాథ్, బీజేపీ నుంచి వేంకటేశ్వర రెడ్డి, కుమారస్వామి, బీఆర్ఎస్ నుంచి సయ్యద్ జమిల్, సీపీఎం పరమేశ్వరచారి, ఎంఐఎం నుంచి రహీం, ఎన్నికల సెక్షన్ నుంచి కిషన్‌నాయక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సేవకుడిగా పని చేస్తా

- కాంగ్రెస్ పార్టీ పాలమూరు ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి

కొత్తకోట, ఏప్రిల్ 16 : మీరు నన్ను ఎంపీగా గెలిపిస్తే మీ సేవకుడిగా పని చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో కొత్తకోట, మదనాపురం మండలాల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపీగా గెలిస్తే వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో మీరు జడ్పీటీసీ, ఎంపీటీసీ, కౌన్సిలర్స్, సర్పంచులు, వార్డు సభ్యులుగా గెలవడం సులువన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు మనమే ఉంటామన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని తుచ తప్పకుండ పాటిస్తుందన్నారు. కార్యకర్తల కష్టం తెలిసిన వాడినని, నేను కార్యకర్త స్థాయి నుంచి ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితుడిగా ఎదిగిన వాడినని గుర్తు చేశారు. రాహుల్‌గాంధీ ప్రధాని అయితే నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన పేద మహిళలకు లక్ష రూపాయల సహాయం అందుతుందన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఆత్మాభిమానం లేని అరుణమ్మను కాంగ్రెస్ ఎమ్మెల్యే, మంత్రి చేసిందని ఆమె మాత్రం పార్టీ కష్టకాలంలో ఉంటే శత్రువులతో కలిసి కాంగ్రెస్‌ను విమర్శించడం దారుణమన్నారు. 400 ఎంపీ స్థానాలు గెలిస్తే రాజ్యాగం మార్చుతామంటున్న బీజేపీకి ఎలా ఓట్లు వేస్తారని ప్రశ్నించారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, కొత్తకోట, మదనాపురం మండలాల అధ్యక్షులు బీచుపల్లి యాదవ్, నాగన్న, ఎంపీపీ పద్మావతమ్మ, నాయకులు ప్రశాంత్, సత్యారెడ్డి, గొల్లబాబు చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ పీజే. బాబు, కృష్ణారెడ్డి, బోయోజ్, వేముల శ్రీను, బాలనారాయణ, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

దేశం కోసం.. ధర్మం కోసం..

ఆత్మకూరు : దేశం కోసం ధర్మం కోసం అంటూ మరోసారి గద్దెనెక్కాలని బీజేపీ ప్రభుత్వం మత రాజకీయాలు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ పాలమూరు పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచందర్ రెడ్డి ఆరోపించారు. ఆత్మకూరు పట్టణంలోని సాయి తిరుమల ఫంక్షన్ హాల్‌లో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పది సంవత్సరాల పాటు అధికారం చేపట్టి ప్రజాధనాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పడమే కాకుండా బడుగు, బలహీన వర్గాల వారి బతుకులకు భరోసా ఇవ్వడం లేదని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు లోపాయికారిగా ఒక్కటై కాంగ్రెస్ పార్టీని ఓడించాలని కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఇక మక్తల్ నియోజకవర్గ ఆడబిడ్డనంటూ బీజేపీ అభ్యర్థి ఈ ప్రాంతంలో తిరుగుతూ ఓట్లు వేయాలని కోరుతోంది. అసెంబ్లీ ఎన్నికలు వస్తే నడిగడ్డ పేరు పార్లమెంట్ ఎన్నికలు వస్తే పాలమూరు పేరు చెప్పుకోవడం తప్ప వారు చేసింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. అనంతరం బీజేపీ నుంచి 200 మందికి పైగా కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నారాయణపేట జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జలంధర్‌రెడ్డి, కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, పోలీస్ చంద్రశేఖర్ రెడ్డి ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ పాలమూరు పార్లమెంట్ అభ్యర్థి వంశీచందర్ రెడ్డి

మోసం చేయడం కాంగ్రెస్‌కు అలవాటు

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 16: ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో మంగళవారం మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. నిరంజన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని అన్నారు. గణపసముద్రం రిజర్వాయర్ ముంపు రైతులకు పెంచిన పరిహారం చెల్లించాలన్నారు. రిజర్వాయర్ రీడిజన్ పేరుతో కాంగ్రెస్ నాయకులు లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. స్థానికేతరుడైన పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవి గతంలో ఎంపీ, ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించి ఈ ప్రాంతానికి చేసిన అభివృద్ధి ఏమిటో చూపించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను గెలిపించాలని కోరారు. మండలంలోని వికలాంగులు ఆర్ఎస్పీని సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణయ్య, ఎంపీపీ కృష్ణా నాయక్, జడ్పీటీసీ సభ్యుడు సామ్య నాయక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి

ప్రాంతీయ పార్టీలు గెలిస్తేనే అభివృద్ధి సాధ్యం

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

వనపర్తి అర్బన్ : ప్రాంతీయ పార్టీలు గెలిస్తేనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం పట్టణంలో కార్నర్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. జాతీయ పార్టీ నాయకులు ఎంపీలుగా గెలిస్తే ఇక్కడి డబ్బులు అధిష్టానానికి సూట్‌కేసులో తీసుకువెళ్తారని, ప్రాంతీయ పార్టీల ఎంపీలు గెలిస్తే మా రాష్ట్రం డబ్బులు మాకు కావాలని కొట్లాడుతామని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై నాగర్‌కర్నూల్‌లో బీఆర్ఎస్‌ను ఓడించేందుకు చీకటి ఒప్పందాలు చేసుకున్నాయని ఆరోపించారు.

చెరువులో పడి వ్యక్తి గల్లంతు

వనపర్తి క్రైమ్, ఏప్రిల్ 16 : ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి గల్లంతైన సంఘటన మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని రాయిగడ్డ కాలనీకి చెందిన బొలెమోని రాములు(42) నల్ల చెరువులో ప్రమాదవశాత్తు పడి గల్లంతయ్యాడు. ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా వారు వచ్చి మృతదేహం కోసం గాలిస్తున్నారు.

ఇంట్లో చోరీ

పెబ్బేరు, ఏప్రిల్ 16 : వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో సోమవారం రాత్రి ఓ ఇంట్లో చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ పక్కన ఉన్న రాజశేఖర్ అనే వ్యక్తి ఆదివారం పెళ్లి కోసమని ఇంటికి తాళం వేసి వేరే ఊరుకు వెళ్లాడు. మంగళవారం ఇంటికి వచ్చి చూడగా బీరువాలో దాచి ఉంచిన రూ.25 వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు దోచుకెళ్లారని తెలిపాడు. ఎన్నికల కోడ్ ఉన్నందున నగదు తీసుకెళ్లొద్దనే ఉద్దేశంతో ఇంట్లో డబ్బులు పెట్టి వెళ్లామని బాధితుడు వాపోయాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

సెల్‌ఫోన్ దుకాణంలో చోరీకి యత్నం


చోరీకి యత్నిస్తున్న దొంగ

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 16 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో అర్ధరాత్రి ఓ దొంగ సెల్‌ఫోన్ దుకాణంలో చోరీకి విఫల యత్నం చేశాడు. సోమవారం రాత్రి ముఖానికి మంకీక్యాప్, చేతులకు గ్లౌజ్‌లు వేసుకుని సుత్తెతో తెలంగాణ చౌరస్తాలో ఉన్న ఓ సెల్‌ఫోన్ దుకాణం తాళం పగలకొట్టాడు. తాళం పగిలినా సెంట్రల్ లాక్ విధానం ఉండటంతో షట్టర్ ఓపెన్ కాలేదు. దొంగ చేసిన ఈ ప్రయత్న దృశ్యాలు సీసీ ఫుటేజీలో రికార్డ్ అయ్యాయి. మంగళవారం షట్టర్ తాళాలు పగిలి ఉండటాన్ని గమనించిన దుకాణం యజమాని సీసీ ఫుటేజీని పరిశీలించారు. అనంతరం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ


బలీద్‌పల్లిలో స్థానికులతో మాట్లాడుతున్న డీఎస్పీ

అడ్డాకుల, ఏప్రిల్ 16 : మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల పోలీస్‌స్టేషన్‌లో అంబేడ్కర్ జయంతి రోజు నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసుపై మంగళవారం డీఎస్పీ వెంకటేశ్వర్లు మండలంలోని బలీద్‌పల్లి గ్రామంలో స్థానికులు, సాక్షులతో విచారణ జరిపారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రారంభంలో తలెత్తిన గొడవలో బలీద్‌పల్లి ఎంపీటీసీ సభ్యుడు గణేశ్‌ను కులం పేరుతో దూషించారని రాంరెడ్డి అనే వ్యకిపై కేసు నమోదైంది. కేసును విచారణలో భాగంగా డీఎస్పీ గ్రామస్థులతో మాట్లాడి, వివరాలు సేకరించారు. డీఎస్పీ వెంట అడ్డాకుల ఎస్సై శ్రీనివాస్, రైటర్ శంకర్‌నాయక్, రాజు ఉన్నారు.

నగదు పట్టివేత

కృష్ణ/బాలానగర్, ఏప్రిల్ 16 : నారాయణపేట జిల్లా కృష్ణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కృష్ణ బ్రిడ్జి చెక్‌పోస్టు వద్ద మంగళవారం కేంద్ర సాయుధ బలగాలు వాహనాల తనిఖీ నిర్వహించాయి. మధ్యాహ్న సమయంలో కర్ణాటక నుంచి ఉట్కూరుకు వస్తున్న కురువ అంజప్ప అనే వ్యక్తి వాహనంలో రూ.86,400 నగదును పోలీసులు పట్టుకున్నారు. పట్టుకున్న నగదుకు సంబంధించి ఎలాంటి రశీదు లేకపోవడంతో వాటిని గ్రీవెన్స్ కమిటీకి పంపించినట్లు ఎస్సై ఎండీ.నవీద్ తెలిపారు. అదేవిధంగా, కర్ణాటక రాష్ట్రం యాదగిరి నుంచి వస్తున్న కారును తనిఖీ చేయగా నబీచాంద్ అనే వ్యక్తి వద్దనున్న రూ.70 వేలను పట్టుకున్నట్లు ఎస్సై వివరించారు. అదేవిధంగా, మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ పోలీసులు జాతీయ రహదారిపై మంగళవారం వివిధ వాహనాలను తనిఖీ చేశారు. ఓ కారును తనిఖీ చేస్తుండగా ఏపీలోని కర్నూల్ జిల్లా దేవకొండ మండలం బేతపల్లి గ్రామానికి చెందిన లక్ష్మయ్య వద్ద రూ.59 వేలు పట్టుబడినట్లు ఎస్సై తిరుపాజీ తెలిపారు. నగదును ఉన్నతాధికారులకు అప్పగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

40 కిలోల సీహెచ్ స్వాధీనం

అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 16 : జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం కొండపేట గ్రామంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించి 40 కిలోల సీహెచ్ పట్టుకున్నట్లు అలంపూర్ ఎక్సైజ్ సీఐ హనుమాన్‌నాయక్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ మహబూబ్‌నగర్ సీఐ బాలకృష్ణారెడ్డి, ఎస్సై నాగరాజుగౌడు, ఇతర అధికారులతో కలిసి సోమవారం రాత్రి కొండపేట గ్రామంలోని కల్లు దుకాణంపై దాడులు నిర్వహించారు. తనిఖీల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 40 కిలోల క్లోరోహైడ్రైడ్(సీహెచ్) లభ్యమైంది. విక్రయానికి ఉంచిన 234 లీటర్ల కల్లును పారబోశారు. గ్రామానికి చెందిన శౌంతివెంకటేష్‌గౌడు, శౌంతి రజనీబాబు గౌడులను అదుపులోకి తీసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి, మంగళవారం తహసీల్దార్ ముందు ప్రవేశపెట్టారు.

ఏడు లీటర్ల సారా పట్టివేత

గద్వాల క్రైం, ఏప్రిల్ 16 : జోగుళాంబ గద్వాల జిల్లాలో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు మంగళవారం మూకుమ్మడిగా దాడులు నిర్వహించి, సారాను స్వాధీనం చేసుకున్నారని, బెల్లం పానకాన్ని పారబోశారని ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో, కేటీదొడ్డి మండల పరిధిలోని వాగుతండా, పూజారి తండా, తూర్పు తండాల్లో దాడులు నిర్వహించి, ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా బట్టీని ధ్వంసం చేసి, 300 లీటర్ల బెల్లం పానకాన్ని పారబోశారు. ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. అలాగే కర్ణాటక రాష్ట్రంలోని సింగిడి తండాలో దాడులు నిర్వహించి, రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. 200 లీటర్ల బెల్లం పానకాన్ని పారబోశారు. ఒకరిపై కేసు నమోదు చేశారు. దాడుల్లో గద్వాల స్టేషన్ సీఐ గణపతిరెడ్డి, టాస్క్‌ఫోర్స్ సీఐ సైదిరెడ్డి, కర్ణాటక ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

కొల్లాపూర్ మునిసిపల్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం


అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా చేతులు ఎత్తిన ఎక్స్‌అఫీషియో సభ్యుడు కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మునిసిపల్ కౌన్సిలర్లు

కొల్లాపూర్, ఏప్రిల్ 16 : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మునిసిపల్ చైర్మన్ రఘుప్రోలు విజయలక్ష్మీపై కాంగ్రెస్ కౌన్సిలర్లు మంగళవారం ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. గత 21వ తేదీన ఇచ్చిన నోటీసు మేరకు జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఆదేశానుసారం కొల్లాపూర్ పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించిన అవిశ్వాస తీర్మానం ప్రిసైడింగ్ అధికారి, నాగర్‌కర్నూల్ డివిజన్ ఆర్డీవో ఎస్.శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించారు. మునిసిపాలిటీలో మొత్తం 20 మంది కౌన్సిలర్లు, ముగ్గురు ఎక్స్‌అఫీషియో సభ్యులు ఉండగా అవిశ్వాస తీర్మానానికి అవసరమైన 15 మందికి గాను సమావేశానికి ఎక్స్‌అఫీషియో సభ్యుడు ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డితో కలిసి మొత్తం 16 మంది హాజరయ్యారు. చైర్మన్ రఘుప్రోలు విజయలక్ష్మీపై ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి సమ్మతి తెలుపుతూ చేతులు ఎత్తడంతో తీర్మానం నెగ్గినట్లు ప్రిసైడింగ్ అధికారి వెల్లడించారు. అవిశ్వాస ప్రక్రియ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీకి చెందిన 2, 4, 15, 17, 20 వార్డుల కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. మరో వారంలోపు కాంగ్రెస్‌కు చెందిన కొత్త చైర్మన్ ఎన్నిక జరగనుంది.

సలేశ్వరం జాతరకు అనుమతి

- ఏడాదిలో తొమ్మిది మాసాలు అనుమతికి చర్యలు
- ఈనెల 22 నుంచి 24 వరకు మూడు రోజులు మాత్రమే అనుమతి
- డీఎఫ్‌వో రోహిత్‌గోపిడి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎఫ్‌వో రోహిత్ గోపిడి

మన్ననూర్, ఏప్రిల్ 16 : నల్లమల అభయారణ్య ప్రాంతంలో వెలసిన సలేశ్వర క్షేత్ర సందర్శనకు ఏడాదిలో తొమ్మిది మాసాలు సఫారీ పర్యటన ద్వారా రోజుకు వంద మందిని తీసుకెళ్లేందుకు అటవీ శాఖ ద్వారా ఏర్పాట్లు చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తున్నామని, ఈ విషయమై స్థానిక చెంచులతో కలెక్టర్ ఉదయ్‌కుమార్ సమక్షంలో చర్చించామని డీఎఫ్‌వో, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో రోహిత్‌గోపిడి తెలిపారు. అమ్రాబాద్ మండలం మన్ననూరు పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ఈనెల 22 నుంచి 24 వరకు మూడు రోజులు సలేశ్వరం జాతర నిర్వహించేందుకు అటవీశాఖ అనుమతులిచ్చిందన్నారు. ప్లాస్టిక్‌ను సాధ్యమైనంత తక్కువగా వాడేలా భక్తులకు సూచనలిస్తున్నామని, అటవీశాఖ ద్వారా మన్ననూరులో చెంచు మహిళల చేత పర్యావరణహితమైన మార్వటాకులతో తయారు చేసిన విస్తరాకులను జాతరలో వాడేందుకు సిద్ధం చేశామన్నారు. అన్నదాన కేంద్రాలు నిర్వహించే దాతలు ఈ యేడాది విస్తరాకుల్లోనే భక్తులకు భోజనం పెట్టాలని ఆదేశించామని చెప్పారు. దేశంలోనే రెండో అతిపెద్ద అమ్రాబాద్ పులుల అభయారణ్యంలో వెలసిన సలేశ్వర లింగమయ్య క్షేత్రానికి ఎంతో విశిష్టత ఉందని, గతంలో చెంచులతో పాటు స్థానికులే ఆరాధ్య దైవంగా కొలిచేవారని, వన్యప్రాణులకు, అడవికి ఎలాంటి నష్టం జరగకుండా కాలినడకన మాత్రమే వెళ్లి చైత్రపౌర్ణమి రోజున లింగమయ్య దర్శించుకునేవారన్నారు. రానురాను ఈ జాతర పదులు వందలతో మొదలై లక్షలాదిగా భక్తుల రద్దీ పెరుగుతూ ఉండడంతో వన్యప్రాణులకు, అడవికి అపారమైన నష్టం జరుగుతోందన్నారు. అలాగే చైత్రపౌర్ణమి రోజున ఒకేసారి వేలాదిగా భక్తులు తరలివచ్చి తొక్కిసలాటలు జరుగుతూ ప్రాణనష్టం కూడా జరుగడం తీవ్ర విషాదాన్ని నింపుతోందని అన్నారు. రద్దీ కారణంగా చాలా మంది భక్తులు లింగమయ్య దర్శనం చేసుకోవడం లేదని అన్నారు. ఓవైపు భక్తుల మనోభావాల్ని గౌరవిస్తూ అటవీ నిబంధనల మేరకు మూడు రోజులు మాత్రమే అనుమతిస్తున్నామని అన్నారు. మిగతా రోజుల్లో సలేశ్వరం చూడలేమనే వారి కోసం అటవీ శాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోందన్నారు. వచ్చే మే నుంచి ఏడాదిలో తొమ్మిది మాసాలు రోజుకు వంద మంది భక్తులను జంగల్ బుక్ సఫారీ వాహనాల్లో సలేశ్వరం తీసుకెళ్లి దర్శనం అనంతరం క్షేమంగా తిరిగి వచ్చేలా త్వరలోనే ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. స్థానిక రాంపూర్ పెంటలో చెంచులే భక్తులకు టిఫిన్, భోజనాలు తయారుచేసి పెట్టడం, చెంచు యువకులే సఫారీ వాహనాలు నడుపుకోవడం, గైడ్‌లుగా పనిచేయడం వంటి ఉపాధి అవకాశాలను శాశ్వతంగా కల్పించనున్నామని పేర్కొన్నారు. పర్యాటకుల ద్వారా ప్యాకేజీలో చెల్లించిన డబ్బులను వేతనాలు చెల్లించేందుకు ఉపయోగించుకుంటామని తెలిపారు. స్థానికంగా ఉండే చెంచులకు ఉపాధి దొరికితే అటవీ ఉత్పత్తుల సేకరణ కోసం మంటలు పెట్టే చర్యలకు ఫుల్‌స్టాప్ పడే అవకాశం ఉందన్నారు. సలేశ్వరం జాతరలో స్థానిక చెంచులు తామే కొబ్బరికాయలు, ఇతర చిరు వ్యాపారాలు చేసుకుంటామని, తమకు ఆర్థిక సహాయం అందించాలని ఐటీడీఏకు విన్నవించుకోగా ఒక్కొక్కరికి రూ.20 వేలు రుణంగా ఇస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో మన్ననూరు రేంజ్ అధికారి ఈశ్వర్, డీఆర్‌వో రవికుమార్, అటవీ విద్యాధికారి శ్వేత పాల్గొన్నారు.

నల్లమల ఘాట్ రోడ్డులో కారు బోల్తా

- నలుగురికి తీవ్ర గాయాలు, హైదరాబాద్‌కు తరలింపు

దోమలపెంట, ఏప్రిల్ 16 : నల్లమల ఘాట్‌రోడ్డు శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారిపై కారు బోల్తా పడిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఈగలపెంట ఎస్సై వీరమల్లు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ మలక్‌పేటకు చెందిన పరమేశ్వర్‌రావు(60), భార్య అన్నపూర్ణ(55), విశాఖపట్టణానికి చెందిన అల్లుడు రాజ్‌కుమార్(38), కూతురు శాంతి(35), మనమరాలు తబిక్ష(2)తో కలిసి శ్రీశైలం వెళ్లారు. మల్లన్న దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో అమ్రాబాద్ మండలం వటువర్లపల్లి సమీపంలో రాజ్‌కుమార్ కారును వేగంగా నడపడంతో వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ప్రమాదంలో నలుగురికీ తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించామని ఎస్సై వివరించారు. చిన్నారికి ఎలాంటి గాయాలు కాలేదని, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు, వ్యక్తికి తీవ్ర గాయాలు

మాగనూరు : నారాయణపేట జిల్లా మాగనూరు మండల కేంద్ర సమీపంలోని 167వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై ఎండీ.అబ్దుల్‌ఖాదర్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకలోని దేవసూగూరు గ్రామానికి చెందిన శరణప్ప(48) మంగళవారం బైక్‌పై గ్రామం నుంచి మాగనూరు వైపు వస్తుండగా జాతీయ రహదారిపైనున్న అభిషేక్ దాబా వద్ద రాయచూరు వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో శరణప్పకు గాయాలయ్యాయి. శరణప్ప కుమారుడు రవికి ఫోన్ ద్వారా విషయం తెలుపగా కారును అజాగ్రత్తగా నడిపిన డ్రైవర్‌పై చర్య తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు. రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు వ్యక్తులకు జైలుశిక్ష, జరిమానా

- మద్యం తాగి వాహనాన్ని నడిపిన కేసులో ఒకరికి
- ఈవ్ టీజింగ్ చేసిన కేసులో మరొకరికి..

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 16 : మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తితో పాటు, ఈవ్ టీజింగ్ కేసులో మరో వ్యక్తికి మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా సెకండ్ క్లాస్ న్యాయాధికారి రామయ్య ఒకరోజు జైలుశిక్షతో పాటు, జరిమానా విధించారు. ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల చేపట్టిన డ్రైంకెన్ డ్రైవ్‌లో మండలంలోని గగ్గలపల్లి గ్రామానికి చెందిన మల్లేష్ అనే వ్యక్తి మద్యం తాగి నాగర్‌కర్నూల్ పోలీసులకు పట్టుబడ్డాడు. ఇతనికి న్యాయాధికారి ఒకరోజు జైలుశిక్షతో పాటు, రూ.2,100 జరిమానా విధించారు. అదేవిధంగా, తూడుకుర్తి గ్రామానికి చెందిన శేఖర్ నాగర్‌కర్నూల్ బస్టాండ్ ప్రాంతంలో అమ్మాయిలతో దురుసుగా ప్రవర్తిస్తుండగా షీటీమ్ పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో శేఖర్‌కు ఒకరోజు జైలుశిక్షతో పాటు, వెయ్యి రూపాయల జరిమానా విధించారు. ఈ రెండు ఘటనల్లో పోలీస్ సిబ్బందిని, షీటీమ్ సిబ్బందిని ఎస్పీ ప్రశంసించారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


లక్ష్మణ్‌నాయక్ (ఫైల్)

బిజినేపల్లి, ఏప్రిల్ 16 : ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతైన యువకుడి మృతదేహాన్ని మంగళవారం ఉదయం ఎన్డీఆర్ఎఫ్ దళాలు బయటకు తీశాయి. ఎస్సై నాగశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇప్పలతండాకు చెందిన లక్ష్మణ్‌నాయక్(18) శనివారం మధ్యాహ్నం తర్వాత ఐదుగురి స్నేహితులతో కలిసి వట్టెంలోని పాలమూరు-రంగారెడ్డి రిజర్వాయర్‌లోని గుంటలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈత కొడుతూ గల్లంతయ్యాడు. మృతదేహం కోసం స్థానిక అగ్నిమాపక సిబ్బంది గాలించినా లభించకపోవడంతో సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి ఎన్డీఆర్ఎఫ్ దళాలు వచ్చాయి. నీటి గుంటలో గాలించగా నీటి అడుగులో రాళ్ల మధ్య ఇరుక్కుపోవడంతో శవం నీటిపై తేలకుండా అక్కడే ఉన్నట్లు గుర్తించి బయటకు తీశారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం బంధువులకు మృతదేహాన్ని అందజేసినట్లు ఎస్సై వివరించారు. ఘటనపై మృతుడి తండ్రి ఆంజనేయులునాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

రాజోలి, ఏప్రిల్ 16 : ట్రాక్టర్ పైనుంచి కింద పడిన బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్దతాండ్రపాడు గ్రామంలో చోటు చేసుకుంది. రాజోలి ఎస్సై జగదీశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొల్ల మల్లేష్ కుమారుడు భరణి(16) సోమవారం తమ వ్యవసాయ పొలంలో ఎరువు వేసేందుకు బాబాయి గొల్లకృష్ణతో కలిసి ట్రాక్టర్‌పై బయలుదేరాడు. పొలంలో ఎరువు వేసి తిరిగి వస్తుండగా గ్రామంలోని చర్చి ముందు సెల్‌ఫోన్ కింద పడింది. ట్రాలీపై నిలబడిన బాలుడు సెల్‌ఫోన్‌ను అందుకునేందుకు పక్కకు వంగి కింద పడిపోయాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ బాలుడి పైనుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స కోసం కర్నూల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

కొత్తకోట, ఏప్రిల్ 16 : మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన కూరగాయల తిరుపతయ్య కుమారుడు కృష్ణయ్య(34) రెండు నెలల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి షిరిడీకి వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో భార్య, కుమారుడు మృతి చెందారు. నాటినుంచి మనోవేదనతో ఉన్న కృష్ణయ్య ఘటన నుంచి తేరుకోలేదు. భార్య, కుమారుడు లేని జీవితం ఎందుకని వేదన చెందుతూ మంగళవారం రాత్రి ఇంట్లో తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిగుడిసె, ఇస్త్రీ డబ్బా దగ్ధం

- నాగర్‌కర్నూల్ జిల్లాలో వేర్వేరు చోట్ల ఘటనలు
- సిద్దాపూర్‌లో కూతురి పెళ్లి కోసం తెచ్చిన డబ్బు, బంగారం అగ్గిపాలు
- నిరాశ్రయులైన బాధిత కుటుంబం


సిద్దాపూర్‌లో కాలిపోయిన పూరిగుడిసె ముందు బాధిత కుటుంబం

అచ్చంపేట టౌన్/కల్వకుర్తి, ఏప్రిల్ 16 : షార్ట్ సర్క్యూట్ ఏర్పడి నాగర్‌కర్నూల్ జిల్లాలోని వేర్వేరు చోట్ల పూరిగుడిసెతో పాటు, ఇస్త్రీ డబ్బా దగ్ధమైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. జిల్లాలోని అచ్చంపేట మండలం సిద్దాపూర్ గ్రామంలో పూరిగుడిసెలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగగా, కల్వకుర్తి పట్టణంలోనూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ఇస్త్రీ డబ్బా దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే..


కల్వకుర్తిలో షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయిన ఇస్త్రీ డబ్బాలోని దుస్తులు

నాగర్‌కర్నూల్ జిల్లా సిద్దాపూర్ గ్రామానికి చెందిన రెడ్డెమోని వెంకటయ్య మంగళవారం తాను ఉంటున్న పూరి గుడిసెకు తాళం వేసి ఉదయం భార్య గోపమ్మ, కుమార్తెతో కలిసి ఉపాధి హామీ పనులకు వెళ్లారు. ఈ క్రమంలో పూరిగుడిసెలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి. గమనించిన చుట్టుపక్కల వారు నీళ్లు పోసి మంటలను ఆర్పారు. అప్పటికే గుడిసెలో ఉన్న రూ.లక్షకు పైగా నగదు, మూడు తులాల బంగారం, బియ్యంతో పాటు, దుస్తులు, వ్యవసాయ సామగ్రి కాలి బూడిదైంది. కూతురి పెళ్లి కోసం పైసాపైసా కూడబెట్టిన డబ్బుతో పాటు, కొని దాచుకున్న బంగారం సైతం మంటల్లో కాలి బూడిదై పోవడంతో బాధిత కుటుంబం భోరున విలపించింది. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ గ్రామస్థులు తహసీల్దార్, విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.

కల్వకుర్తిలో...

నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో షార్ట్ సర్క్యూట్‌తో ఇస్త్రీ డబ్బా దగ్ధమై బట్టలు కాలిపోయాయి. పట్టణంలోని విద్యానగర్ కాలనీలో ఎం.శ్రీనివాస్ ఇస్త్రీ డబ్బా పెట్టుకొని దుస్తులు ఇస్త్రీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం డబ్బాను మూసి భోజనానికి ఇంటికెళ్లాడు. ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ జరిగి డబ్బాలోని దుస్తులు, ఇస్త్రీ పెట్టెలు కాలి బూడిదయ్యాయి. షాపులో నుంచి వస్తున్న పొగలను గుర్తించిన స్థానికులు సమాచారమివ్వడంతో వచ్చి చూసేసరికి దుస్తులన్నీ కాలి బూడిదయ్యాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

జమ్ము మొక్కలకు చెలరేగిన మంటలు

- తగలబడిన వ్యవసాయ నీటి పరికరాలు

అయిజ, ఏప్రిల్ 16 : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం సంకాపూర్ గ్రామంలో పంటకు నీటి పంపిణీ చేసేందుకు ఉన్న విద్యుత్ పరికరాలు, పైపులు మంటల్లో కాలిపోయాయి. మంగళవారం మధ్యాహ్నం ఉన్నట్టుండి మంటలు చెలరేగడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. సంకాపూర్ గ్రామ సమీపంలో గల చెక్‌డ్యాంలో లోతైన గొయ్యిని బావిలా తవ్వి రైతులు విద్యుత్ మోటార్లు అమర్చుకున్నారు. వాటి ద్వారా పొలాలకు నీటిని పంపిణీ చేసుకొని పంటలు పండించుకుంటున్నారు. నీటి పరిసరాల్లో జమ్ము పెరిగి వట్టిపోయింది. మంగళవారం మధ్యాహ్నం ఉన్నట్టుండి జమ్ము మొక్కలకు మంటలు చెలరేగి అక్కడే రైతులకు చెందిన విద్యుత్ స్టార్టర్లు, తీగలు, పైపులు మంటల్లో తగులబడిపోయాయి. రైతులు గోపాల్, వెంకట్రాములు, సూర్యనారాయణ, సత్యనారాయణ, ఈరన్న, నర్సింహులు, తిమ్మప్పతో పాటు, దాదాపు 40 మంది రైతులకు చెందిన నీటిని తోడ వేసే యంత్ర పరికరాలు మంటల్లో కాలిపోయాయి. రైతులు గమనించి మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికి ఫలితం లేకుండా పోయింది. రూ.మూడు లక్షల వరకు నష్టం జరిగినట్లు బాధిత రైతులు తెలిపారు.


నీటితో మంటలను ఆర్పుతున్న రైతు

యువతి అదృశ్యం కేసు నమోదు

మిడ్జిల్, ఏప్రిల్ 16 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి(17) అదృశ్యమైంది. ఎస్సై చంద్రమోహన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 15న కుట్టుమిషన్ నేర్చుకునేందుకని పక్క గ్రామానికి వెళ్లిన యువతి తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆచూకీ కోసం కుటుంబీకులు వెతికారు. మంగళవారం యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నట్లు ఎస్సై తెలిపారు. కాగా, బంధువైన ఓ యువకుడిపై అనుమానం ఉన్నట్లు యువతి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై చెప్పారు.

నల్లవెల్లిలో యువకుడు..

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 16 : నాగర్‌కర్నూల్ జిల్లా నల్లవెల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఎస్సై గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బతిక రాజేష్(28) కొంతకాలంగా హైదరాబాద్‌లో మేస్త్రీ పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. గతేడాది ఓ యువతితో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో అతన్ని తీసుకొచ్చి కౌన్సెలింగ్ నిర్వహించి గ్రామంలోనే ఉంచారు. సోమవారం ఇంటి నుంచి బైక్ తీసుకుని వెళ్లిన రాజేష్ తిరిగి రాకపోవడంతో ఆచూకీ కోసం వెతికారు. రాజేష్ జాడ కానరాకపోవడంతో భార్య లక్ష్మీ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. రాజేష్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారు.

వనపర్తి డిపోకు కొత్త బస్సులు మంజూరు చేయండి

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి


ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు వినతిపత్రం ఇస్తున్న చిన్నారెడ్డి

వనపర్తి టౌన్, ఏప్రిల్ 16: వనపర్తి ఆర్టీసీ డిపోకు మరో 26 కొత్త బస్సులను మంజూరు చేయాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌తో చిన్నారెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ...ప్రజా రవాణా సంస్థలో వనపర్తి ఆర్టీసీ డిపోకు గొప్ప పేరు ప్రఖ్యాతలు ఉన్నాయని, అలాంటి వనపర్తి ఆర్టీసీ డిపోకు కొత్తగా 26 బస్సులను మంజూరు చేయాలని అన్నారు. అదేవిధంగా వనపర్తిలోని పాత బస్టాండ్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి, వాణిజ్య పరంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని, దీంతో డిపోకు ఆదాయం కూడా సమకూరడంతో పాటు ప్రజలకు వ్యాపార పరంగా లాభం చేకూరుతుందన్నారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఆర్టీసీ ఎండీ తప్పకుండా మంజూరు చేస్తా మని, పాత బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకొస్తామని భరోసా ఇచ్చినట్లు చిన్నారెడ్డి తెలిపారు.

తాగునీటి సమస్య రానివ్వం

- మునిసిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్

వనపర్తి టౌన్, ఏప్రిల్ 16: పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని వనపర్తి మునిసిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్ అన్నారు. మంగళవారం పట్టణంలోని విలేకరుల కాలనీ, జంగాలగుట్ట, లక్ష్మీనరసింహ కాలనీల్లో పర్యటించి తాగునీటి సమస్యపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం నీటి ఇబ్బందుల వల్ల ప్రజలు పొదుపుగా నీటిని వాడుకోవాలని, రానున్న మరో రెండు మాసాల పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పట్టణ ప్రజలకు నీటి ఎద్దడి కలుగకుండా బోర్లను రిపేర్ చేయించడం, నీటి లభ్యత పుష్కలంగా ఉన్న రైతులతో బోర్ల ద్వారా కొనుగోలు చేయడం వంటి అనేక ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. అత్యవసరమైన చోట వెంటనే ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీరు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ పూర్ణచందర్, ఏఈ సాయికిరణ్, మిషన్ భగీరథ ఏఈ శివకుమార్, స్థానిక కౌన్సిలర్ విభూది నారాయణ, కాలనీ ప్రజలు ఉన్నారు.

మొక్కలకు ప్రతీ రోజు నీరు పోయాలి

పెద్దమందడి, ఏప్రిల్ 16: ఎండలు ముదురుతున్నందుకు నర్సరీలలో పెంచే మొక్కలకు ప్రతీ రోజు నీరు పోయాలని ఎంపీవో శ్రీరామ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని గట్లఖానాపూర్‌లో నర్సరీని పరిశీలించారు. మొక్కలకు ఎండకుండా ఉదయం, సాయంత్రం నీరు పట్టాలని అన్నారు. గ్రామాలలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అనంతరం స్కూల్ తండాలో పనిచేస్తున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఎండలు ఎక్కువ ఉండడంతో కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తాగునీరు వృథా చేయొద్దు

వీపనగండ్ల, ఏప్రిల్ 16: ప్రజలు తాగునీటిని వృథా చేయొద్దని తహసీల్దార్ వరలక్ష్మి తెలిపారు. వీపనగండ్లలో పగిలిపోయిన మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతు పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. పైపులైన్ లీకేజీలను వెంటనే మరమ్మతులు చేపట్టి తాగునీరు కలుషితం కాకుండా చూడాలని తెలిపారు. తాగునీటి సమస్య రాకుండా తగు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి, భగీరథ సిబ్బందికి తెలిపారు.

నాగరాల పునరావాస కేంద్రంలో విచారణ

శ్రీరంగాపురం, ఏప్రిల్ 16: మండలంలోని నాగరాల పునరావాస కేంద్రం-3లో తహసీల్దార్ మురళి విచారణ జరిపారు. మూడో కేంద్రంలో కొంత మంది ప్రభుత్వానికి చెందిన ప్లాట్లను ఆక్రమిస్తున్నారని అదే కేంద్రానికి చెందిన కొందరు ఇటీవల ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్ మంగళవారం విచారణ జరిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కొన్ని ప్రభుత్వ ప్లాట్లు మిగిలి ఉన్నాయని, వాటిని ఎవరైనా ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ, వినోభారెడ్డి, చంద్రరాయుడు, గ్రామస్థులు ఉన్నారు.

సాధారణ కాన్పుల సంఖ్య పెంచాలి

- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయచంద్ర మోహన్

వనపర్తి వైద్యవిభాగం, ఏప్రిల్ 16: జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో సాధారణ కాన్పులను పెంచాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయచంద్ర మోహన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రెండు నర్సింగ్ హోమ్‌లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణ కాన్పు కోసం తీసుకోవాల్సిన జాగ్రతలు వివరించాలన్నారు. రెండు ఆస్పత్రుల్లో మార్చి, ఏప్రిల్ నెలలో జరిగిన సిజేరియన్, సాధారణ కాన్పుల వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి చంద్రయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ జల్లు మధు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు సాధించాలి

- అసిస్టెంట్ ప్రొఫెసర్ పీ కృష్ణమూర్తి



అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణమూర్తిని సన్మానిస్తున్న కళాశాల బృందం

వనపర్తి రూరల్, ఏప్రిల్ 16: ఆంగ్ల భాష కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు సాధిస్తే జీవితంలో విజయాన్ని సాధించినట్టే అని అసిస్టెంట్ ప్రొఫెసర్ పీ కృష్ణమూర్తి అన్నారు. ఆంగ్లభాష కమ్యూనికేషన్ స్కిల్స్‌పై మంగళవారం వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (కో-ఎడ్యుకేషన్)లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపక బృందం శాలువా కప్పి సన్మానించారు. అనంతరం కృష్ణమూర్తి ఆంగ్ల భాష కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. సమాజంలో విద్యార్థుల యొక్క బాధ్యతను గుర్తు చేస్తు , జీవిత సమస్యలను ఎలా ఎదుర్కోవాలి, పోటీ పరీక్షలకు ఆంగ్ల భాష నైపుణ్యం ఎంత అవసరమో తెలియజేశారు. ఆంగ్ల భాషను సులువుగా ఎలా మాట్లాడాలో దానికి సంబంధించిన మెళకువలను వివరించారు. ఆంగ్ల భాషపై విద్యార్థులు పట్టు సాధించి ఉన్నత స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు. ప్రస్తుత తరుణంలో ఆంగ్లభాష ప్రాధాన్యం పెరుగుతుందన్నారు. ఇది ఒక ఎంప్లాయిమెంట్ లాంగ్వేజ్‌గా మాత్రమే కాకుండా నిజ జీవితంలో ఒక కమ్యూనికేషన్ ఛానల్ లాంగ్వేజ్‌గా మారిందని అన్నారు. కార్యక్రమంలో దామ్‌సింగ్, అధ్యాపకులు మద్దిలేటి, రజిత, విద్యార్థులు ఉన్నారు.

సీతారాముల కల్యాణానికి ముస్తాబైన ఆలయాలు

చిన్నంబావి/ అమరచింత, ఏప్రిల్ 16: శ్రీరామ నవమి వేడుకల కోసం మండలంలోని రాములోరి ఆలయాలను ముస్తాబు చేశారు. బెక్కెం, గూడెం, కొప్పునూరు, వెలటూరు, వెలగొండ గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాలు సీతారాముల కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. అమరచింతలోని మార్కండేయ ఆలయానికి రంగుల అద్ది ముస్తాబు చేశారు.

ఎస్సీలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

శ్రీరంగాపురం, ఏప్రిల్ 16: మండల కేంద్రానికి చెందిన ఎస్సీలకు ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాలను ఇవ్వాలని ఎస్సీ కాలనీ చెందిన పలువురు మంగళవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. గతంలో సర్వే నెంబరు 91లో 129 మందికి ఇంటి స్థలాల పట్టాలు అందించారు. దశాబ్దాలు దాటిన అధికారులు లేఅవుట్ చేసి స్థలం చూపించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారని వారు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు డి.శ్రీనివాసులు, జిల్లా నాయకులు బహుజన రమేష్ అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు రాజేష్, నాయకులు డాక్టర్ కురుమన్న, ఆర్‌పీ బీసన్న తదితరులు ఉన్నారు.

ఒలంపియాడ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

వనపర్తి రూరల్, ఏప్రిల్ 16: ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్‌లో వనపర్తి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. గత మార్చిలో జాతీయ స్థాయిలో పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఈ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల్లో మొత్తం 150 మంది విద్యార్థులు పాల్గొనగా 138 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇందులో ఉత్తమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన ఆడెం మనస్విని, కార్తికేయ, సంజనకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మల్లెంపాటి శ్రీవిద్య, ప్రిన్సిపాల్ జవహర్ బాబు, ఏజీఎం భాస్కర్ రెడ్డి, కో ఆర్డినేటర్ మధు తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఏప్రిల్ 16: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోపు ఆన్‌లైన్‌లో వివరాలు అప్‌లోడ్ చేసి రైతులకు సకాలంలో డబ్బులు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో నిర్దేశించిన 242 కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఇప్పటికే కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపించాలని, రైతులు పంట అమ్మిన 48 గంటల్లోనే నగదు వారి ఖాతాల్లో జమ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

జిల్లాలోని మిల్లుల నుంచి రావాల్సిన సీఎంఆర్ బియ్యం సకాలంలో అందించే విధంగా డీటీలు పర్యవేక్షణ చేయాలని సూచించారు. మూడు సీజన్‌లకు సంబంధించి మిల్లర్లు కార్పొరేషన్‌కు అందించాల్సిన 18వేల మెట్రిక్ టన్నుల పెండింగ్ ధాన్యాన్ని ఏప్రిల్ 30వ తేదీ లోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గతంలో నాణ్యత లేని బియ్యం ఇచ్చిన మిల్లర్లకు నోటీసులు పంపి ధాన్యాన్ని వెనక్కి పంపామని, బదులుగా వారి నుంచి నాణ్యమైన ధాన్యం తిరిగి సేకరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎస్‌వో శ్రీనివాసులు, డీఎం ప్రవీణ్ , మార్కెటింగ్ అధికారి స్వరణ్ సింగ్, డీఆర్‌డీవో పీడీ, డీటీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే మేఘారెడ్డి


తిప్పాయిపల్లిలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

పెబ్బేరు/పెబ్బేరు రూరల్, ఏప్రిల్ 16: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. మంగళవారం పెబ్బేరు పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్లో పెబ్బేరు, శ్రీరంగాపూర్ ఉమ్మడి మండలాల కార్యకర్తలతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరయ్యారు. కార్యకర్తలతో మాట్లాడి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఈనెల 23న మల్లురవి కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్నారని, ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. కార్యకర్తలు భారీ ఎత్తు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఎంపీ ఎన్నికల్లో మల్లు రవిని భారీ మెజార్టీతో గెలిపించడానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ప్రస్తుతం పెబ్బేరులో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యావని, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కాంగ్రెస్ నాయకులు ప్రోటోకాల్ పాటిస్తూ రైతులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తనకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అనంతరం మండలంలోని తిప్పాయిపల్లిలో ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో అక్కి శ్రీనివాస్‌గౌడ్, వెంక టేష్, సాగర్, రంజిత్‌కుమార్, సాగర్, సురేందర్ గౌడ్, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


పెబ్బేరులో షటిల్ ఆడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవి

పెబ్బేరు, ఏప్రిల్ 16: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ అభ్యర్థి డాక్టర్ మల్లురవి అన్నారు. మంగళవారం జూరాల క్యాంప కాలనీలో ఆయన మార్నింగ్ వాక్‌లో పాల్గొన్నారు. అంతకు ముందు సోమవారం రాత్రి అంబేడ్కర్ నగర్‌లో ఒకటో వార్డులో పల్లె నిద్రను చేశారు. వార్డు ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కర్రెమ్మ గుడి వద్ద కార్యకర్తలతో సమావేశమై రాత్రి అక్కడే బస చేశారు. మంగళవారం ఉదయం పెబ్బేరు పట్టణంలో గుడ్‌మార్నింగ్ పెబ్బేరు ప్రోగ్రామ్ నిర్వహించారు. మార్నింగ్ వాక్‌లో ఫుట్‌బాల్, క్రికెట్, షటిల్‌గేమ్స్ ఆడారు. తమకు పార్లమెంటుకు వెళ్లే అవకాశం కల్పించాలని కోరారు. ఆయనతో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మరోసారి మోదీయే ప్రధాని


సమావేశంలో మాట్లాడుతున్న డీ నారాయణ

వనపర్తి అర్బన్, ఏప్రిల్ 16: కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పడడంతో పాటు మరోసారి నరేంద్ర మోదీయే ప్రధాని అవుతారని జిల్లా పరిషత్ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో బీజేపీ ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచం మొత్తం విశ్వ గురువుగా పిలువబడే నరేంద్రమోదీ మూడోసారి కూడా ప్రధానమంత్రి అవుతారని తెలిపారు. గతంలో ఎప్పుడు లేని సంక్షేమ పథకాలను పదేళ్లలో అమలు చేశారని గుర్తు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ మాట్లాడుతూ... కులమతాలకు అతీతంగా ప్రధాని మోదీ పరిపాలన చేశారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి బీజేపీ ఎంపీ అభ్యర్థికి అండగా నిలవాలని వివరించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మున్నూరు రవీందర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం, జిల్లా ప్రధాన కార్యదర్శి రామన్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దగూడెంలో..

వనపర్తి రూరల్ : కేంద్రంలో మూడోసారి నరేంద్ర మోదీ ప్రభుత్వమే వస్తుందని సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి అన్నారు. ఎంపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆయన వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామంలో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం ఉపాధి కూలీలను కలిసి కూలి డబ్బులు సకాలంలో వస్తున్నాయా అని అడిగి తెలుసుకున్నా రు. ప్రధాని నరేంద్రమోదీ రుణం తీర్చుకోవాలంటే మనందరం బీజేపీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్‌కు మద్దతు తెలిపాలన్నారు.

ఖిల్లాఘణపురంలో..

ఖిల్లాఘణపురం : దేశంలో అవినీతి రహిత పాలన ప్రధాని మోదీకే సాధ్యమని బీజేపీ వనపర్తి అసెంబ్లీ ఇన్‌చార్జి, ఆమన్‌గల్ మాజీ జడ్పీటీసీ సభ్యుడు కండె ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా బడుతూ... నరేంద్రమోదీ పదేళ్ల మచ్చలేని నాయకుడిగా పాలన అందించారన్నారు. పేద మహిళలకు ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద ఉచితంగా సిలిండర్ అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్ గౌడ్, సీతా రాములు, బుచ్చిబాబుగౌడ్, రాంరెడ్డి, ఆశన్న, శివశంకర్, సత్యనారాయణ, చక్రవర్తి, రాంచందర్, గోపి, విక్రమ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెబ్బేరులో..

పెబ్బేరు : పెబ్బేరు పట్టణంలోని 12వ వార్డులో మంగళవారం బీజేపీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా ఆ పార్టీ నాయకులు ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ ఇన్‌చార్జి శివారెడ్డి, నాయకులు సబ్బిరెడ్డి వెంకటరెడ్డి, వేమారెడ్డి, కంచ ఆంజనేయులు, బుచ్చన్న, నరసింహ నాయుడు, రంగస్వామి, సర్వేశ్వర్‌గౌడ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నంబావిలో...

చిన్నంబావి : మండలంలోని బెక్కెం గ్రామంలో బీజేపీ నాయకులు మంగళవారం లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని మరోసారి మోదీ ప్రధాని కావాలంటే ఎంపీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం జనరల్ సెక్రటరీ లవ నాయుడు, బూత్‌కమిటీ అధ్యక్షుడు శ్రీరాముడు, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఉదయ్ పాల్గొన్నారు.

అమరచింతలో..

అమరచింత : బీజేపీ పాలమూరు పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణకు మద్దతివ్వాలని మంగళవారం అమరచింతలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆయా వార్డులలో తిరిగి డోర్ స్టిక్కర్స్ అతికించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు క్యామ భాస్కర్, నాయకులు మేర్వ రాజు, నరాల నారాయణ, సిద్ది రాములు, అనిల్, రాకేష్ శెట్టి, ప్రశాంత్, నరసింహ, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

- విద్య, వైద్య రంగాల బలోపేతానికి కృషి : జడ్పీ చైర్మన్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీచైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి

పాన్‌గల్, ఏప్రిల్ 16 : వేసవిలో గ్రామాలలోని ప్రత్యేక అధికారులు తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పరిషత్ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం పాన్‌గల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో అధికారులు తమ శాఖలపై నివేదికలను చదివి వినిపించారు. అనంతరం జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా తాగునీటి సమస్య ఉన్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తాగునీటిని అందించాలని సూచించారు. గ్రామాల్లో బోర్లు, బావులను లీజుకు తీసుకుని ప్రజల దాహార్తిని తీర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటించి గ్రామ సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా పని చేయాలని, ఉద్యోగులు ఏక పక్షంగా వ్యవహరిస్తే ఇబ్బందులు తప్పవన్నారు. విద్య, వైద్య రంగాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధి కోసం ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పనిచేయాలని, తద్వారానే గ్రామ సమస్యలు పరిష్కరించబడుతాయని సూచించారు. ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యులు మూడావత్ లక్ష్మి, వైస్ ఎంపీపీ కే కవిత, ఎంపీడీవో కోటేశ్వర్, డీటీ అశోక్‌కుమార్, ఎంపీవో రఘురామయ్య, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, ఏఈలు చందన్ కుమార్‌రెడ్డి, రమణ, లక్ష్మికుమార్, వెంకటేష్, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

షిర్డీ సాయి ఆలయంలో ప్రత్యేక పూజలు


ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న సీతాదయాకర్ రెడ్డి

ఆత్మకూరు, ఏప్రిల్ 16 : ఆత్మకూరు పట్టణంలోని షిర్డీ సాయి ఆలయం నిర్మించి 24 వసంతాలు పూర్తి చేసుకొని 25వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్ రెడ్డి ఈ వేడుకలకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. షిర్డీ సాయి ఆలయంలో నిర్వహించే పూజలకు మండల ప్రజలే కాకుండా ఇతర మండలాలు, జిల్లాల నుంచి అనేక మంది భక్తులు హాజరు కావడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి షిర్డీ సాయి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మేడపల్లి బాలకృష్ణారెడ్డి, ఎస్‌టీడీ శ్రీనివాసులు, పిన్నంచర్ల వెంకటేష్, గాలిపంపు శ్రీనివాస్, తిరుపతయ్య గౌడ్, కుమార్ తదితరులు ఉన్నారు.

రంగనాథుడిని దర్శించుకున్న ఆధ్యాత్మికవేత్త

శ్రీరంగాపురం, ఏప్రిల్ 9: మండలంలోని రంగనాథస్వామిని మంగళవారం ఆధ్యాత్మిక వేత్త రాధా మనోరదాస్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆలయం రాబోయే రోజుల్లో అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు విష్ణుస్వామి, కన్నయ్య స్వామి, సురేష్ ఆచార్యులు, ధనుంజయచార్యులు, ఆలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

నేడు ఉమ్మడి జిల్లా స్థాయి ఎద్దుల బండ్ల గిరక పోటీలు

ఆత్మకూరు, ఏప్రిల్ 16: శ్రీరామనవమి సందర్భంగా ఆత్మకూరు మండల ంలోని మూలమల్ల గ్రామంలో నేడు ఉమ్మడి జిల్లా స్థాయి ఎద్దుల బండ్ల గిరక పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సాకే ఆనంద్ తెలిపారు. ఈ పోటీలు బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రజా చైతన్య కెరటం గద్దర్


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ మురళీధర్, సాహితీ కళావేదిక ప్రతినిధులు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఏప్రిల్ 16: ప్రజా చైతన్య కెరటం గద్దర్ అని ప్రముఖ వైద్యుడు మురళీధర్ అన్నారు. సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో ప్రజా వాగ్గేయకారుడు స్వర్గీయ గద్దర్ స్మారక సంచిక సాంగ్ మార్చ్ పుస్తక పరిచయ సభ మంగళవారం వనపర్తిలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ మురళీధర్ హాజరై మాట్లాడుతూ.. గద్దర్ తన జీవితకాలం ప్రజా సమస్యలపై పాటను ఆయుధంగా చేసుకుని పోరాడారని, ప్రజల్లో చైతన్యాన్ని రగిలించారని అన్నారు. దాదాపు 170 మంది కవులు, రచయితలు గద్దర్ ఉద్యమ జీవితాన్ని వ్యక్తిత్వాన్ని వ్యాసాలు, కవితలు, పాటల రూపంలో ఒక సంచికగా వెలువరించడం అభినందనీయమని అన్నారు. సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ... మలి దశ తెలంగాణ ఉద్యమాన్ని గద్దర్ పాటలు ఎంతో ప్రభావితం చేశాయని వివరించారు. కార్యక్రమంలో భైరోజు చంద్రశేఖర్, వనపర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్ కుమార్ యాదవ్, ఆర్‌డీఎస్ సంస్థ నిర్వాహకురాలు చిన్నమ్మథామస్, కందూరు నారాయణ రెడ్డి, బండారు శ్రీనివాస్ , మల్యాల బాలస్వామి, గంధం నాగరాజు, బత్తుల శ్రీనివాసులు, రాజారాం ప్రకాష్ ఉన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు సహకరించాలి

పాన్‌గల్, ఏప్రిల్ 16 : గ్రామాల్లో క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతీ ఒక్కరు సహకరించాలని హెల్త్ అసిస్టెంట్ రాంచందర్ అన్నారు. మంగళవారం మండల ంలోని కేతేపల్లిలో గ్రామస్థులకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి జ్వరం, దగ్గు తెమడలో రక్తం పడటం పది రోజులకు మించి జ్వరం రావడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కలిగిన వారు సమీపంలోని పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధిసోకి ఉంటే రోగులకు ప్రభుత్వం ఉచితంగా మందులు అందిస్తుందని, పోషకాహారం తీసుకునేందుకు నిక్షయ్ పోషణ్ పథకం ద్వారా నెల రూ. 500 నగదు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం శ్రీలక్ష్మి, ఆశ కార్యకర్తలు కవిత, సంధ్య, గ్రామస్థులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం

పాన్‌గల్, ఏప్రిల్ 16 : మండల కేంద్రంలోని ఖిల్లా గట్టుపై వెలిసిన హజ్రత్ ఆగావూద్ గంధోత్సవాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన ముస్లిం మతపెద్ద జీఎం జమీల్ ఆధ్వర్యంలో చేపట్టిన గంధోత్సవం కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గాలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాముయాదవ్, గ్రామస్థులు మహబూబ్ గౌస్, చోటు, బాలరాజు, రాములు, వేణు, ఖాదర్, సాధిక్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ మాజీ సర్పంచ్

అమరచింత, ఏప్రిల్ 16: మండలంలోని పామిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ పావని బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, పీసీసీ కల్లుగీత డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ పావని, ఆమె భర్త వెంకటరెడ్డి, నాయకుడు బషీర్ తదితరులకు మహబూబ్ నగర్ పార్లమెంట్ అభ్యర్థి వంశీచందర్ రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు మార్క సరోజ వెంకటయ్య, మోహన్ రెడ్డి, తదితర నాయకులు ఉన్నారు.

గొర్రెల యజమానికి ఆర్థిక సాయం

పెద్దమందడి, ఏప్రిల్ 16: మండలంలోని జగత్‌పల్లి గ్రామానికి చెందిన కురుమయ్య గొర్రెలు ఇటీవల కుక్కల దాడిలో మృతి చెందాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆర్థిక సాయం ప్రకటించారు. ఇందులో బాగంగా మంగళవారం ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు గట్టుయాదవ్ ద్వారా రూ. 20వేల ఆర్థిక సహాయం బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో చంద్రయ్య సాగర్, వెంకటయ్య యాదవ్, పుట్టలయ్య యాదవ్, రాములు యాదవ్, రమేష్ యాదవ్, అశోక్‌యాదవ్, వెంకటేష్‌యాదవ్, నరేష్ యాదవ్, అంజియాదయ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.